'భారతి'

శ్రీమతి కే. యన్. మూర్తిబాయిగారు

"భారతీ" యని పిలిచెను బ్రహ్మానందరావు.

"ఊఁ. వస్తూన్నాను" అని అంటూ స్యాండెల్సు చప్పుడు చేసుకొంటూ వచ్చినది భారతి.

బ్ర:—నాకు కాలేజీ టయిమయినది. సూటు మడతది తీసియివ్వుము."

మడతసూటు యిచ్చినది భారతి. సూటు ధరించుతూ,

బ్ర:—నేడు యింగ్లీషువిద్య నేర్పెదను. నేర్చుకొనవలెను. "రెడీ"గా యుండుము.

భారతి:—"అబ్బా. నాకు రాదు. యిష్టమునూ లేదు. మరియొక రోజున జూచెదము లెండి."

బ్రహ్మానందరావునకు పట్టరాని కోపము వచ్చి, మొహము ఎర్రబార, తన ద్విచక్రిపై కాలేజీకి రివ్వుమని వెడలిపోయెను. పాపము ముగ్ధయగు భారతి యిందలి భావమును గ్రహించలేకపోయెను.

బ్రహ్మానందరావుయొక్క నివాసస్థలము చెన్నపట్టణము. ప్రస్తుతము 'బి. యల్.' క్లాసు, 'లా' కాలేజీలో చదువుచుండెను. 'సీటీ' వాస్తవ్యుడగుటచే, 'సిటీ పాలిషు', సిటీ యెడ్యుకేషను', :సినీమా ఫేషను'లయం దతనికి యభిరుచి మెండు. యిక భారతియో—పల్లెటూరిపిల్ల. తన తల్లి చిఱుత ప్రాయముననే చనిపోవుటచేత తన మాతామహుల యింట నొక కుగ్రామములో పెరిగెను. మరియు తల్లిలేని పిల్ల గనుక, నల్లారుముద్దుగా పెరిగెను. తాతగారు తన మనుమరాలికి తెనుగు, సంస్కృతము ఒక పండితునిచే నేర్పించెను. భారతి యిప్పుడు కవనము నల్లును. ఈ రెండు భాషలలోను చాలా పాండిత్యము సంపాదించెను. భారతికి యుక్తవయస్సు రాగానే, అనగా శారదాబిల్లు అమలులోనికి రాకమునుపే, భారతిని బ్రహ్మానందరావునకు యిచ్చి పెండ్లిజేసెను. బ్రహ్మానందరావు బి. యల్. క్లాసులో చదువుచున్నప్పుడు భారతి కాపురమునకు వచ్చినదాది 'సిటీపాలీష్', 'సినీమా ఫేషన్'లను ఎట్లనో కష్టపడి కొంతవరకు నేర్చుకొనెను. కాని 'సిటీ యెడ్యుకేషను'కు మాత్రము దూరమయ్యెను. సిటీలో ప్రతీ 'జట్కావాలా'కు వచ్చిన యింగ్లీషు, భారతికి రాదయ్యెను. నేర్చుకోవలెనని శ్రద్ధయూ లేదు. బ్రహ్మానందరావునకు సిటీలో యుండుటచేతనూ, అందులో 'బి. యల్.' క్లాసు చదువుచుండుటచేతనూ యింగ్లీషుయం దభిమానము ఎక్కువ. తన భారతికూడ యింగ్లీషు చదువుకొని మీటింగులలోనేమి, యింటికి వచ్చిన 'గెస్టు'లోనేమి, యింగ్లీషుతో అనర్గళముగా మాట్లాడవలెనని యాతనికి కుతూహలము. కాని యింగ్లీషువద్ద భార్యాభర్తలిద్దరకు వాదప్రతివాదములు తరచూ జరుగుచుండెను. భారతికి ప్రస్తుతము దేశీయవిద్యయగు 'హిందీ' నేర్చుకొనవలెనని యత్నము. మర్యాదకు భంగము రాకుండుటకున్నూ, గౌరవము పెంపొందుటకున్నూ రాజవిద్యయగు 'యింగ్లీషు' రావలెనని బ్రహ్మానందునకు ఆశయము. అందుచే యింగ్లీషు నేర్చుకొనమని భారతికి పలుమారులు జెప్పెను. బ్రతిమాలెను. కసరెను. భారతి వీటిని చెవిపెట్టక, ఎప్పటికప్పుడు వాయిదాలు వేయుచుండెను. ఒకనాడు బ్రహ్మానందరావునకు ఒడలు మండి, పైజెప్పిన రీతి కోపముగా కాలేజీకి వెడలిపోయెను. భారతి యిది కోపము అనుకొనలేదు. కాని మామూలు పరిపాటు కాదనిమాత్రము గ్రహించెను- ఆతను మధ్యాహ్నం కాఫీకి రాకపోవడము చేత. బ్రహ్మానందరావు కాలేజీనుంచి సాయంకాలము గృహమునకు వచ్చెను. తన సూటు విప్పుటకు సహాయార్థమై తన యర్థాంగిని పిలువలేదు. పలుకరించనూలేదు. టెన్నీసుఆట నిమిత్తమై దుస్తులను ధరించి, బ్యాటును జేతపుచ్చుకొని క్లబ్బునకు వెళ్లెను. భారతి వెలవెలబోయెను. రాగము స్ఫురించిన దనుకొనెను.

రోజులు గడచెను. కాలచక్రము తిరుగుచుండెను. భారతికి మనోవ్యాధి పుట్టెను. బ్రహ్మానందరావునకు మనోనిశ్చయము పట్టెను. అతని దృష్టి తన కాలేజీలో చదువుచున్న కమలపై బారెను. ఒకరినొకరు కలియునప్పుడెల్ల చూచడము, చిరునవ్వు నవ్వడము, పలుకరించడము, క్రమేపి, ఒకవిధమయిన పరిచయములోనికి మారెను. కొన్ని దినములకే పరిచయము స్నేహముగ పరిణమించినది. ఈడూ జోడూవారగుటచే ఈ స్నేహము అన్యోన్యరాగముతోను, మోహముతోను మిళితమైయున్నది. ఒకరోజు కలయకయుండినచో నెంతో భారముగ నుండెను. బ్రహ్మానందరావునకు సర్వము కమలమయమే. అగ్నిముఖముగా పెండ్లాడిన భారతి, ఆంగ్లవిద్యరాని భారతి యిప్పుడు స్ఫురణరాదయ్యెను.

* * * *

భానుమతి, భారతికి మేనత్తకూతురు. చెన్నపురిలోనే మెడికల్ కాలేజీలో చదువుకొనుచుండెను. ఒకనాడు భారతిని జూడనేగెను. భారతినల్ల బ్రహ్మానందరావుయొక్క చర్యయాంతయు విని దిగ్భ్రమజెందెను. తనకు సావకాశము చిక్కినప్పుడు తప్పక యింగ్లీషు నేర్పెదననియు, యింతవరకు యింగ్లీషు నేర్చుకొననందులకు తన కాపురమునకు ముప్పు వాటిల్లినదనియు, భర్తను సంతోషపెట్టు మార్గమే యవలంబించవలయుననియు నొక్కి వక్కాణించెను.

* * * *

బ్రహ్మానందరావునకు యిప్పుడు కమల యన యెక్కువ ప్రేమ. భారతి యన యెక్కువ నసహ్యము. ఒకనాటి సాయంకాలము కాలేజీ వదిలినతోడనే టెన్నిసుయాట మాని, కమలతో విహారార్థమై యేగెను. కొంతదూర మేగుసరికి, ఒక యినుకతిప్ప కాన్పించెను. అచ్చట కూర్చొనిరి. సూర్యుడప్పుడే యస్తమించెను. మలయమారుతము వీచుచుండెను. బ్రహ్మానందరావు కమల తొడపై తన శిరమునుంచి పండుకొని, యిష్టాగోష్టిని మాట్లాడుకొనుచుండిరి.

బ్ర:—కమలా! నీకన్న నా కెవ్వరూ యీ ప్రపంచకములో యాప్తు లెవ్వరూలేరు.

క:—భారతి లేదా.

బ్ర:—భారతిని నేను ప్రేమించుటలేదు. వంటకు పనికి వచ్చునని యామెను నింటనుంచితిని.

క:—ప్రియా! దానికొరకా వుంచితిరి.? ఒక వంటదానిని కుదిర్చెదను. భారతిని తన పుట్టినింటికి వెళ్లమనుము. మన స్వేచ్ఛకు యాటంకముండదు. నేను మీ యింటికి నిరభ్యంతరముగ, నిరాటంకముగ వచ్చుచుండెదను. మన ప్రేమకు, సుఖమునకు యిక భారతి యడ్డుండదు.

బ్ర:—ప్రేయసీ! అంతకన్న ఉన్నదా. యిప్పుడే భారతిని త్రోలివేసెదను' అనుచూ మరియొకసారి కమలను బిగియార కౌగలించుకొని, తనివితీర ముద్దులిడి, యిద్దరూలేచి గృహాభిముఖులై నెడలిరి.

బ్రహ్మానందరావు భారతిని తన పుట్టినింటికి వెళ్లమని యాజ్ఞయిచ్చెను. కారణము జెప్పలేదు. తలవనీ తలంపుగ, అకారణముగ, భర్తృగృహమును వీడి వెళ్లమను వార్త పిడుగువలె పడెను. భారతి యాతని పాదములపైబడి, తన యింట తుద కొక దాసిగానైన నుంచమని వేడెను. తనను క్షమింపమనెను. కాని, బ్రహ్మానందరావు మూర్ఖపట్టు పట్టెను. కమలానురాగముచే యది ద్విగుణమయ్యెను. కన్నీరు మున్నీరై కాలువగట్ట భారతి ఏడ్చెను. కాని బ్రహ్మానందము మనస్సు కరుగలేదు. అవును. ఎందుకు కరుగును? కమలాలోలుడై, యామె మోహపాశములచే బంధితుడైయుండుటచే, భారతియొక్క యార్తనాదము, దీనాలాపములు వినబడునా? మనస్సున కెక్కునా? భారతి ఎచ్చటకో నేగెను. బ్రహ్మానందమునకు స్వేచ్ఛ యెక్కువయ్యెను. ఆటంకము పెట్టెడువా రెవ్వరునూలేరు. భోజనముకూడ క్రమేపి ఇంగ్లీషు స్టైలులోనికి మారినది. యిదివరకు వెండిపళ్లెములో క్రిందనే కూర్చొని భుజించెడివాడు యిప్పుడో, 'టేబిల్ మీల్సు' అనగా మేజాబల్ల

మీద కత్తులముళ్ల సహాయముతో భోజనం. ఈ 'ఫర్క్కే'లో భోజన మారగించుట నవనాగరికత లక్షణము! కాదు-ఎక్కువ గౌరవము!! తనస్నేహితులను యప్పుడప్పుడు విందులకు బిలుచుచూ, యింగ్లీషుస్టైలులో జరిపించుచుండెను. కమలకు యా సమయములలో మురుసతనము హెచ్చై లోటుపాటులను దీయుచుండెను. విందనంతరము, 'సిగరెట్సు' కాల్చడము, పలురకములయిన 'డ్రింక్సు' త్రాగడము, డబ్బుపెట్టి బ్రిడ్జి, ఎత్తుల్లు మొదలగు పేకాటలు ఆడడము జరుగుచుండెను. యిదంతయు గౌరవార్థమునకే; లేనిచో 'సొసైటీయెటికెట్టు'నకు భంగకరమని.

ఒకనాడు సాయంకాలము 'స్పెషల్ లెక్చర్సు' యుండుటచేత బ్రహ్మానందము యింటికి ఆలస్యముగ వచ్చెను. కమల తనకొరకై వేచియుండక మరియొక స్నేహితునితో షికారున కేగెను. బ్రహ్మానందము తన దుస్తులను మార్చి కమలను గలయుటకై యేగెను. కొంత దవ్వేగినప్పటికి చేరువనున్న యొక మామిడి తోపులో, బిన్నగున్న మామిడిచెట్టు క్రింద ఎవ్వరో యిద్దరు యువకులు సంభాషించుకొనుచున్నట్లు అతనికి గోచరమయ్యెను. దగ్గరకు వెళ్లిచూడ, ఎవ్వరు తనను నిండారప్రేమించెనని యనుకొనెనో, ఎవ్వరి స్నేహమువల్ల భారతిని పోగొట్టెనో, యట్టి కమల, టక్కులమారి, తన సహాధ్యాయుడైన రామారావుని బాహువల్లికలోనుండి మోహావేశపరవశులై, ప్రపంచకమును మైమరచినట్లుండిరి. బ్రహ్మానందరావు నిశ్చేష్టుడయ్యెను. ఆశ్చర్యము, కోపము, విచారము అన్నియు నాతని నావాహించెను. భారతియొక్క నిష్కళంకప్రేమయు పతిభక్తియు, కమలయొక్క కపటప్రేమయు విషపునవ్వులు, తేనెలొలుకు మాటలు, బుజ్జగింపులు-నాతని మనమున కెక్కెను. ఈచిత్రమంతయు, కలయా, కల్లయా. యని భ్రమించెను. ధైర్యము దెచ్చుకొని

బ్ర:—యిది నీకు తగునా కమలా యని గద్గద స్వరముతో ననెను.

కమల:—యిదియూ ఒకవిధమయిన "సొసయిటీ ఎటికెట్" నీవేమి జేసుకొన్నభర్తవా, నన్ను యాజ్ఞ పెట్టుటకు ?

ఇక బ్రహ్మానందరావు ఒక్క నిముష మచ్చట యుండక గృహమున కేగెను. మనస్సు కలవరమొందెను. భోజన మారగించలేదు. నిద్రపోలేదు. ఏమో యాలోచనలలో మునిగెను. ఒకవైపున కమలయొక్క దుష్ప్రవర్తన, తన యందలి నిరసన భావము, మరియొకవైపున భారతియొక్క నిష్కళంక ప్రేమయూ, దీనాలాపములు, అన్నియు జ్ఞప్తికివచ్చి మనస్సును బాధించెను. కమలయొక్క యింగ్లీషు విద్యయే యింతముప్పు వాటిల్లెనని యనుకొనెను. స్త్రీలకు యింగ్లీషువిద్య నేర్పించకూడదనియు, యింగ్లీషు వచ్చుటచేగదా మగ, ఆడ, సొసైటీలలో విచ్చలవిడిగ తిరుగుట, క్లబ్బులోను పాల్గొనుట, మగవారితో స్వేచ్ఛగా విహరించుట మొదలగునవి సంభవించును గదా యని కమలను నిందించెను. మరియొకసారి యిట్లు తలపోసెను. యింగ్లీషు విద్యను నేర్చుకొనుటలో తప్పేమియు లేదు. అన్నింటికి, మన మనస్సే ప్రధానము. మన బంగారము బాగుండిన, కంసాలివానిని నేల నిందింపవలయు. మనోనిబ్బరము, హృదయపూర్వకప్రేమ, మంచి నడవడి యుండినచో జాలును. ఇంగ్లీషువారు తమ స్త్రీలకు స్వేచ్ఛావిహారము యడ్డుపెట్టరు. వారికి మనస్సే ప్రధానము. నిష్కళంకమయిన మనస్సుతో స్త్రీలను జూచెదరు, కలసిమెలసి తిరుగుదురు. యిక మనవారిలోనో, యట్లుకాదు. సమాన వయస్కురాలగు వనితను జూడగనే, చెడు తలంపులు పుట్టును. అందుకనే, మన స్త్రీలకు స్వాతంత్రము నివ్వక, సొసైటీలలో తిరుగనిచ్చుటకు జంకెదరు. అంతియు కాని వేరుకాదు. యింగ్లీషు విద్యలో నేవిధమయిన జబ్బులేదు. మనలోను మన స్త్రీలలోను యుండు

కొను చెడు తలంపులే, దుష్ప్రవర్తనకు గారణమని నిర్ధారణ జేసుకొనెను. తన యసూయకు భారతిని, తొందరపడి గృహమునుండి వెడల గొట్టినందులకు చింతాక్రాంతుడయ్యు యామె యెడల జూపిన నిరాదరణకు తగిన ప్రాయశ్చిత్తముకొరకై యాలోచింపుచూ, గాఢనిద్రబోయెను.

తెల్లవారెను. సూర్యభగవానుడు ఈశాన్యదిక్కునుండి బయలుదేరెను. గడియారము 8 గంటలు కొట్టెను. కాని బ్రహ్మానందరావునకు మెలకువ రాలేదు. మరి కొంతసేపటికి, గవాక్షము లోనుంచి, సూర్యకిరణములు జొచ్చి, తక్షణముగ నాతని మోము పైబడ, మెలకువగాంచెను. కాలకృత్యములను దీర్చుకొని, ప్రాతఃకాలపు అల్పాహారమారగించి, కాఫీ సేవించి, తన యీజీచైరులో కూర్చుండెను. ఒక చేతితో పుస్తకము జూచుచూ, మరొక జేతితో, సిగరెట్టును పీల్చుచుండెను. పుస్తకము జదువవలెనని యత్నమే గాని, కలవరమొందిన మనస్సు యగుటచే, ఆలోచనలతో నిండెను. సిగరెట్టు దమ్ము ఏమీ సహాయము జేయలేదు. ఆతని ఆలోచనలు అన్నియు, కమల చేష్టలతోను, భారతి ముగ్ధత్వముతోను నిండుకొనెను. ఆసమయములో, పోస్టల్ జవాను ఒక ఉత్తరమతనికి నందజేసెను. పైవిలాసము యింగ్లీషుతో వ్రాసియుండెను. లోని సంగతులునూ యింగ్లీషుతోనే వ్రాసియుండెను. దానిలోని సంగతులు ఏమో కాని, ఒక పెద్దనిట్టూర్పు విడిచి, 'భారతీ' నన్ను క్షమింపవా యనెను. ఇది భారతి యింగ్లీషుతో వ్రాసిన క్షమాపణ ఉత్తరము. ఒకసారి, రెండుసార్లు-జదివెను. తృప్తి నొందలేదు. మరియొకసారి జదువుకొనెను. వెంటనే లేచి దుస్తులను ధరించి, యింటికేగెను, అచ్చట భారతిని జూచి

"నేను తొందరపడితిని. అపరాధిని. క్షమింపుము." అనెను మెల్లగ.

భారతి:—క్షమించుటకేమున్నది. యింగ్లీషు నేర్చుకొనక పోవుటచేత వచ్చినది యిదంతయు.

బ్ర:—యింత కొద్దికాలములో యింగ్లీషులో ఉత్తరము వ్రాయగల పాండిత్యమెట్లు సంపాదించితివి?

భారతి:—భానుమతి వదిన చలవ.

బ్ర:—యింగ్లీషువిద్య నేర్చుకొని, ఆచారములలోనూ, సొసైటీలలో తిరుగుటయందు, యింగ్లీషువారితో తులతూగవలెనన్న యాశయమే తప్ప వారికుండు మనోనిబ్బరము మంచి తలంపులు, తమ యీడుజోడు స్త్రీలను చూచినప్పుడు, కలిసినప్పుడు మనవారిలో యుండకపోవుటచే కలిగిన యనర్థకముల జడివి చూచితిని. అనుభవించితిని. ప్రాయశ్చిత్తమునకై నీకొరకై వచ్చితిని. క్షమించి నన్నాదరింపుము.

భానుమతి:—యిందెవ్వరి తప్పును లేదు. విధి యిట్లు వ్రాసియున్నది. యీరోజున మాయింట విందారగించి మరి వెళ్ళవలయును.

విందనంతరము, భారత బ్రహ్మానందములు తమ గృహమునకేగి, సంతోషముతో కాలముగడిపిరి.